# ఈ శిక్ష చాలు

"హలో, సుజాతా బావున్నావా?" బట్టల దుకాణంలో చీరలు చూస్తున్న సుజాత భుజం మీద చెయ్యివేసి ఆప్యాయంగా పలకరించింది డాక్టర్ అన్నపూర్ణ.

"హలో, మీరా! ఏమిటి, మీరు ఊళ్ళో లేరా ఈ మధ్య రెండు మూడుసార్లు ఫోన్‌చేస్తే లేరన్నారు."సుజాత మర్యాదగా అంది.

"ఆఁ. అవును. మూడునెలల సూపర్ స్పెషాలిటీ కోర్సు కోసం లండన్ వెళ్ళాను."

"అదా. అందుకే మీరు లేరు అన్నారు మీ క్లినిక్‌కు ఫోన్ చేస్తే".

"ఏమిటి, ఎనీ ప్రాబ్లమ్?" డాక్టర్, సుజాత వంక సూటిగా చూస్తూ అడిగింది.

"ఓసారి మీ దగ్గరకి రావాలని... మాట్లాడాలని."

"సరే, రేపు క్లినిక్కు రా. పన్నెండు తర్వాత రా. కాస్త ఖాళీ ఉంటుంది అప్పుడు. లేదంటే ఆదివారం సాయంత్రం ఇంటికి రా."

"వద్దులెండి. మీకు దొరికేదే ఒక పూట. మీవారు, పిల్లలు ఇంట్లో అంతా సరదాగా ఉండే రోజు ఒక్కపూట, రేపు పన్నెండుకి క్లినిక్‌కు వస్తాను."

"ఓ.కే. బై.. సీ యూ టుమారో." డాక్టర్ అన్నపూర్ణ చెయ్యి ఊపి వెళ్ళిపోయింది.

* * *

అన్నపూర్ణ మెటర్నిటీ అండ్ ఫెర్టిలిటీ సెంటర్ బోర్డు మీద డాక్టర్ అన్నపూర్ణ రకరకాల ఇండియన్, ఫారిన్ డిగ్రీలు, ఫెర్టిలిటీ సబ్జెక్టులో చేసిన స్పెషలైజేషన్స్ డిగ్రీలు. ఆ నర్సింగ్‌హోమ్‌లో బయట, లోపల ఉన్న పేషెంట్స్‌ని చూస్తే ఆవిడ క్షణం తీరిక లేని డాక్టర్ అని అందరికీ తెలుస్తుంది.

ఔట్‌పేషెంట్ల హడావిడి కాస్త తగ్గి, రిలాక్స్‌డ్‌గా బోర్నవిటా తాగే సమయం అది. సుజాతని చూసి "రా. రా కూర్చో. ఏమిటో మాట్లాడాలన్నావు. ఏమిటి ప్రాబ్లమ్? ఎనీథింగ్ రాంగ్" అంది అన్నపూర్ణ ఆప్యాయంగా.

డాక్టర్ అన్నపూర్ణ, సుజాత అక్క డాక్టర్ రమ చిన్నప్పటినుంచి మెడిసిన్ వరకు వైజాగ్‌లో చదివిన క్లాస్‌మేట్స్. రూమ్‌మేట్స్. సుజాత తన ఫ్రెండు చెల్లెలు అన్న అభిమానంతో చనువుగా మాట్లాడుతుంది అన్నపూర్ణ.

"ఏం లేదు. కిందటిసారి మీ దగ్గర చెకప్ చేయించుకున్నాక, ఆయనని మూడునెలలు వాడమని మందులు రాశారుట కదా. మందులు వాడినా నోరిజల్ట్. మరోసారి టెస్ట్ చేసి పొజిషన్ ఇంప్రూవ్ అయిందేమో చూస్తారా?" సుజాత కాస్త ఆశగా చూస్తూ అడిగింది.

డాక్టర్ అన్నపూర్ణ అర్థం కానట్లు మొహం పెట్టింది. "ఏదో మందులు వాడితే ఇంప్రూవ్ అవుతుందనలేదు. నేనేం హోప్ ఇవ్వలేదే. సరే. మందులు వాడితే నష్టంలేదు. పోనీ,. ట్రైచేద్దాం. అనుకున్నాను. కానీ, లాభంలేదు సుజాతా ఏదో కాస్త తక్కువ కౌంట్ ఉంటేమందులు హెల్ప్ చేస్తాయిగాని, అంత తక్కువ కౌంట్ ఉంటే మందులు వాడినా ప్రయోజనం లేదు, ఏదో మిరకిల్‌లా జరిగితే తప్ప".

ఈసారి సుజాత ఆశ్చర్యంగా చూసింది. "అంటే, ఏభై అయిదు మిలియన్ల కౌంట్ కూడా తక్కువ కిందే వస్తుందా? ఎక్కడో చదివాను. 30, 35 మిలియన్లు చాలు ప్రెగ్నెన్సీ రావడానికి అని, మొటిలిటీ తక్కువుందా?" సుజాత అనుమానంగా అడిగింది. మరోసారి ఆశ్చర్యంగా చూసింది అన్నపూర్ణ.

"ఏభై అయిదు మిలియన్లా? అంత ఉంటే ప్రాబ్లమ్ ఏమిటి? ఫిఫ్టీ ఫైవ్‌కౌంట్ ఉందని ఎవరన్నారు?"

"ఆయన రిపోర్టులో - మీరిచ్చిన రిపోర్టు చూపించారు. ఫిఫ్టీఫైవ్ మిలియన్ కౌంట్‌రాసి ఉంది. మొటిలిటీ కూడా సరిగ్గా గుర్తులేదు. కానీ, బాగానే ఉందన్నారు. అన్నీ సరిగానే ఉన్నాయి. ఇంక భగవంతుడిదే భారం అన్నారు."

"ఐ డోంట్ అండర్‌స్టాండ్ వాట్ యూ ఆర్ టాకింగ్, నేనిచ్చిన రిపోర్టులో 10 మిలియన్లు స్పెర్మ్ కౌంట్, 10శాతం మొటిలిటీ అని ఉంటే, ఏభై అయిదు అంటావేమిటి? అంత కౌంట్ ఉంటే అసలు ప్రాబ్లమ్ ఏం లేనట్టే గదా. నువ్వు అసలు సరిగా ఆ రిపోర్టు చూశావా? మా క్లినిక్‌దేనా, ఇంకేదన్నానా? ఏది ఆ రిపోర్టు తీసుకురా రేపు చూద్దాం నాకు బాగా గుర్తుంది. రమ ప్రత్యేకంగా ఫోన్ చేసి చెప్పిందని ఒకటికి రెండుసార్లు అన్ని టెస్టులూ స్వయంగా చేశాను. సారీ సుజాతా. ఏదో ఎక్కడో పొరపాటు పడ్డట్టున్నావు.ఎనీహౌ,ఆ రిపోర్టు మరోసారి చూద్దాం తీసుకురా. మీవారు రిపోర్టు తీసుకెళ్ళడానికి వచ్చినప్పుడు ఆయనతో స్పష్టంగా అన్ని వివరాలు చెప్పాను. నీకు ఆయన

చెప్పలేదా? పిల్లలు పుట్టే అవకావాలు ఆల్‌మోస్ట్ నిల్ అని చెప్పాను. నీలో ఏ లోపం లేదు. మీ ఆయనలోనే లోపం అన్నది స్పష్టంగా చెప్పాను. సరే, మరీ నిరాశ పడచడం ఎందుకని ఈ మందులు మూడు నెలలు వాడండి, తరువాత మరోసారి సెమన్ టెస్ట్ చేద్దాం అని చెప్పాను. మూడు నెలల తరువాత ఆయన మళ్ళీ రాలేదు. ఈలోగా నేను ఇంగ్లండ్ వెళ్ళాను."

సుజాత మొహం పాలిపోయింది డాక్టర్ చెప్పింది విని. 'ఎంతమోసం! ఎంత అబద్ధం! అంతా సరిగా ఉందని రిపోర్టు చూపించితే నమ్మింది తాను. అన్నీ సరిగా ఉన్నా, భార్యాభర్తలు ఇద్దరిలో లోపం లేకపోయినా, ఒక్కోసారి గర్భం రాదు. దానికి కారణం మెడికల్ హిస్టరీలో కనుగొనబడలేదు. బహుశా భగవంతుడి దయ అంటే ఇదేనేమో అని డాక్టర్ అన్నట్లు చెపితే అందుకే మళ్ళీ తాను డాక్టరుని అడగలేదు. ఏదో మాత్రలు వేసుకుంటుంటే, ఏమో దేవుడి దయవల్ల గర్భంవస్తుందేమో అనుకుంది. ఆ విషయం భగవంతుడిమాదే భారం వేసి వదిలేసింది. అన్నపూర్ణని నిన్న చూడకపోతే మళ్ళీ ఈ ప్రసక్తి వచ్చేదికాదు. ఊరకే మరోసారి అడుగుదామన్నట్లు తాను అడిగింది. ఎంత దగా, ఎంత మోసం! తనను నమ్మించి ఫూల్‌ని చేశాడు. లోపం తనలో ఉంచుకుని ఇలా అబ్ధం చెప్తాడా' సుజాతలో అవమానం, కోపం, కసి పెల్లుబికాయి.

మాడిపోయిన సుజాత మొహం చూసి, "సారీ సుజాతా, మీవారు నీకు అంతా చెప్పి ఉంటారనుకున్నాను. లేకపోతే నీకే డైరెక్టుగా ఫోన్‌చేసి చెప్పేదాన్ని. మీ అక్కకి కూడా మీరు ఎలాగూ చెప్తారని నేను ఫోన్ కూడా చెయ్యలేదు." డాక్టర్ నొచ్చుకుంటూ అంది.

"మా అక్కకి నేను కూడా అంతా సరిగా ఉందన్నారు అంటూ రిపోర్టులు గురించి రాశాను. తానూ భగవంతుడి దయ అనుకో అని రాసింది కూడా. ఈయన ఇంత అబద్ధం ఆడతారని నేననుకోలేదు". విషణ్ణవదనంతో అంది.

"సారీ, ఆయన ఇలా చేస్తారని నేనూహించలేదు".

"ఉండండి. నాకెందుకు ఇలా అబద్ధం చెప్పారో, ఇంత మోసం ఎందుకు చేశారో వెళ్ళి నిలదీస్తాను." సుజాత కోపంగా అంది.

"ఉండు. తొందరపడకు. ముందు నన్ను ఆ రిపోర్టులు మళ్ళీ ఒకసారి చూడనీ, రేపు పట్టుకురా, అవి మా క్లినిక్‌వా, ఇంకెక్కడన్నా చేయించారా అన్న ఆరా తీయకుండా తొందరపడకు. రేపు అవి చూశాక మాట్లాడవచ్చు." అన్నపూర్ణ నచ్చచెప్పింది.

"ఆయనకెంత ధైర్యం! మీరు నాకు తెల్సినవారు. మిమ్మల్ని మళ్ళీ

అడుగుతానేమోనన్న భయం కూడా లేకుండా ఇంత అబద్ధం చెప్పారు."

"బహుశా, రిపోర్ట్ చూసి నీవు నమ్మి సమాధానపడి పోతావని అనుకుని ఉంటారు. ఆయనతో ముందే గొడవపడకు. రేపు రిపోర్టు తీసుకురా" సుజాత భుజం తట్టింది ఓదార్పుగా డాక్టర్ అన్నపూర్ణ.

* * *

సాయంత్రం ప్రభాకర్ ఇంటికి వచ్చేసరికి గదిలో పడుకుని ఉన్న సుజాతని చూపి, "ఏం తొందరగా వచ్చేశావు - బ్యాంకుకు వెళ్ళలేదా" అన్నాడు కాస్త ఆశ్చర్యంగా. రోజూ ప్రభాకర్ కంపెనీకి ఎనిమిదిన్నరకే వెళ్ళిపోతాడు. సుజాత బ్యాంకుకి 10 గంటలకి వెళ్ళి దగ్గరే కనుక మళ్ళీ లంచ్‌కి వచ్చి ఓ గంట ఉండి, సాయంత్రం ఆరుగంటలకి వస్తుంది, అప్పటికి సాధారణంగా ప్రభాకర్ ఇంటికి వస్తాడు. సుజాత ముభావంగా "వెళ్ళ" లేదు. ఇవాళ వంట్లో కాస్త బాగులేదు" అంది "ఏమయింది, జ్వరమా?" వాడిన ఆమె మొహం చూసి అడిగాడు.. "ఏం లేదు. కాస్త తలనొప్పి" ఇంక మాటలు పెంచకుండా గదిలోంచి వెళ్ళిపోయింది.

రాత్రి కూడా సుజాత మామూలుగా లేకపోవడంతో "ఏమిటి సంగతి? మళ్ళీ అత్తాకోడలు దెబ్బలాడుకున్నారా?" హాస్యంగా అన్నాడు. సుజాత చురచుర చూసి అతికష్టంమీదమాట తూలకుండా అదుపులో ఉంచుకుంది నోటిని. ప్రభాకర్‌ని నిలదీసి కడిగి పారేయాలని ఎంతో అనిపించినా, ఒక్కరోజు ఓపిక పట్టి అసలు సంగతి పూర్తిగా తెలుసుకునేవరకు ఆ ప్రసక్తి తేరాదు అనుకుంది. ఉదయం నుంచి మనసు ఉడికిపోతోంది సుజాతకి . అసలు లోపం తనలోఉంచుకుని లోకం ఎదుట తనని దోషిగా నిలబెట్టాడు. ఉన్న విషయం చెపితే సానుభూతితో అర్థం చేసుకుని, ఏ పిల్లనో పెంచుకునేవారు. అతనిలో లోపం అతను కావాలని చేసింది కాదు గదా! చెపితే తానేం మొగుడ్ని వదిలేసి పోదుగదా! తన దగ్గర లోటు ఒప్పుకోవడానికి మగ అహం అడ్డుచ్చినట్టుంది. పిల్లలు కలగకపోవడానికి కారణం అతను అంటే అందరిలోచులకన అయిపోతానన్న భయంగాబోలు, ఇన్నాళ్ళూ పిల్లలు కలక్కపోతే ఆడదాన్నే 'గొడ్రాలు' అంటూ దోషిగా నిలబెట్టేవారు. ఇప్పుడు అన్నిరకాల పరీక్షలకి వీలు వివరం కలిగాక, మగాడిలో లోపం కనిపెట్టాక ఆడదాన్ని నిందించడం కాస్త తగ్గినా, అవకాశం ఉన్నంతవరకు తనలో లోపం బయటపడకుండా చూసుకుంటాడు మగాడు. ఇదేతనలో లోపం ఉంటే ప్రభాకర్ ఎలా రియాక్ట్ అయ్యేవాడు? అత్తగారు సాధించి చంపేది ఇంకా పిల్లలు కలగకపోతే ఆ భార్యని వదిలించుకుని ఇంకో పెళ్ళి చేసుకునే వీలు లేకపోయినా సాధింపు ఉండేది.

అసలు పెళ్ళయ్యాక ఓ ఏడాది పిల్లలు వద్దనుకుని ఫ్యామిలీ ప్లానింగ్ మాత్రుల వేసుకుంది. రెండోఏడు మాత్రలు మానాక నార్మల్ అయి మళ్ళీ గర్భం రావడానికి టైము పడుతుందని పెద్దగా ఎదురుచూడనూల లేదు. బాధపడనూ లేదు. రెండో ఏడు ఇంట్లో అత్తగారి గొణుగుడు ఎక్కువైంది. 'ఏమిటోనమ్మా -పాతిక ముప్ఫై ఏళ్ళకి పెళ్ళిళ్ళు చేసుకున్నా ఇంకా పిల్లలు వద్దనుకుంటూ మాత్రలు మింగడాలు. వీళ్ళతో పెళ్ళి అయినవాళ్ళ పిల్లలకే ఏడాది నిండింది. మనవల ముద్దూముచ్చట చూసుకునే అదృష్టం ఇంకా నాకెప్పుడో అంటూ మొదలుపెట్టి ప్రతినెల అయినప్పుడల్లా ఆవిడ 'ఊఁ... అయ్యావూ... ఏమిటోపెట్టి పుట్టాలి. పిల్లలు పారాడని ఇల్లు ఓ ఇల్లో. ఈ చదువులు, ఉద్యోగాలు వెలగబెడుతూ కావాలనుకోవడం, వద్దనుకోవడం అంతా వీళ్ళ చేతుల్లోనే ఉందనుకుంటారు. హుఁ. వద్దనడం చేతిలో ఉందేమోగానీ, కావాలనుకున్నప్పుడు బజారు నుంచి తెచ్చుకునేదా. వద్దు వద్దు. పిల్లలువద్దు అనుకుంటే నెత్తిమీద తథాస్తు దేవతలుంటారట. అలాగే అవుతుంది మరి' అనేది. ఆవిడ ఆరాటం అర్థం అయినా తానేం చేస్తుంది? ఏడాది వద్దనుకుందిగాని, ఈ ఏడాదినుంచి కావాలను అనుకుంటున్నారుగా తామూ, ఆవిడన్నట్లు కావాలనుకున్నప్పుడు అవదేమో! రెండేళ్ళు నిండిపోయాయి. తనకూ పిల్లలు కావాలని, తల్లినవాలని బలంగా కోరిక కలుగుతుంది. ప్రభాకర్ ప్రతీసారీ డిసపాయింట్ అయ్యేవాడు. "ఏమిటోయ్, మా అమ్మ కోసమైనా ఓ పిల్లని కనవమ్మా తల్లీ."హాస్యంగా విసుక్కునేవాడు ప్రతినెలా పీరియడ్స్ వచ్చినప్పుడల్లా, ఏదో తన చేతిలో ఉండితాను కనడం లేదన్నట్టు అత్తగారు, మొగుడు అలా అంటే ఉక్రోషం వచ్చింది ఓసారి. "పదండి. ఓసారి డాక్టర్ దగ్గరకెడదాం, మాటిమాటికీ పిల్లల్ని కనడం లేదని నన్ను దెప్పుద్దు మీరిద్దరూ" అంది కోపంగా. ప్రభాకర్ "నీవెళ్ళి చూపించుకో, నాకేం ప్రాబ్లమ్ లేదు" అన్నాడు చాలా నమ్మకంగా. "పెళ్ళయి రెండున్నర ఏళ్ళయింది. నాలో ఏం లేదన్నది నీకు తెలీదా" కొంటెగా, గర్వంగా అన్నాడు. "చాల్లెండి బడాయి. దానికి, దీనికీ ఏం సంబంధం లేదు. అన్నీ పైకి సరిగా ఉన్నా, కొందరిలో స్పెర్మ్ కౌంట్ తక్కువ ఉండచ్చు. నేను మేగజైన్స్‌లో చదివాను. ఓసారి చూపించుకుంటే సందేహం తీరిపోతుందిగా" అంది. "సర్లే. చూద్దాం మా ఫ్రెండ్స్‌ని ఎవరినన్నా అడుగుతాను ఎక్కడ చూపించుకోవాలో". ఇంట్లో అత్తగారు డాక్టరు దగ్గరకెళ్ళమన్న పోరు ఎక్కువవడం, చీటికీ మాటికి ఆవిడ అసంతృప్తి వెల్లడించడంతో డాక్టరయిన తన అక్క సలహా కోరుతూ ఉత్తరం రాసింది సుజాత. ఈలోగా వారం, పదిరోజుల తరువాత ఓ రోజు ప్రభాకర్ తాను టెస్ట్ చేయించుకున్నాను. అంతా సరిగా ఉందన్నారు అంటూ ఓ రిపోర్టు

చూపించాడు. "అదేమిటి, ఎప్పుడు చూపించుకున్నారు? నాకు చెప్పలేదు. నేనూ వచ్చేదాన్నిగా" అంది ఆశ్చర్యంగా సుజాత.

"అది మగాళ్ళది. నీవెళ్ళి లేడీ డాక్టర్ చేత చూపించుకో" అన్నాడు. అంతా సరిగా ఉందన్నాడు కదా అని రిపోర్టు సరిగా చదవలేదు. ఆ తరువాత ప్రభాకర్ ఎందుకో కొన్నాళ్లు ముభావంగా, అన్యమనస్కంగా ఉండేవాడు. "మరి అన్నీ సరిగా ఉంటే ఈ పాటికి ప్రెగ్నెన్సీ రావాలేమో" అంది అక్కడికీ సుజాత.

"ఏమో నాకేం తెలుసు;? నీలో ఏదన్నా ప్రాబ్లమ్ ఉందేమో. ఊరికే ఇంక నన్ను పదిసార్లు విసిగించకు. పిల్లలు లేకపోతే పీడా పోయింది. ఈ గోలతో మనశ్శాంతి లేకుండా పోయింది" అని విసుక్కున్నాడు. తల్లి ఏదో అంటే, ఆవిడ మీదా ఎగిరాడు ఒకటి రెండుసార్లు. తరువాత పిల్లల ప్రసక్తి తెచ్చేవాడు కాదు ప్రభాకర్.

ఈలోగా సుజాత అక్క రమ ఉత్తరం రాసింది. తన స్నేహితురాలు డాక్టర్ అన్నపూర్ణ అనే ఆవిడ ఈ సబ్జెక్ట్‌లో స్పెషలైజేషన్ చేసి హైదరాబాదులో ఫెర్టిలిటీ సెంటర్, క్లినిక్ ఓపెన్ చేసిందని, ఆవిడకి నేనే ప్రత్యేకం నీ గురించి రాస్తున్నాను. నీవెళ్ళి చూపించుకో. అన్ని టెస్టులు చేయించుకో అంటూరాసింది. ఆవిడతో అపాయింట్‌మెంటు ఫిక్స్ చేసుకుని "వెడదాం పదండి" అంది సుజాత ప్రభాకర్‌తో. ప్రభాకర్ అనవసరమైన దానికంటె ఎక్కువ విసుగు చూపని, "అబ్బ ఎన్నిసార్లు టెస్ట్ చేయించుకోవాలి. నే చేయించుకున్నాను గదా. నీవు వెళ్లిచేయించుకో" అన్నాడు.

సుజాత ఒంటరిగానే వెళ్ళి కల్సుకుంది. "మీవారు రాలేదు. ఇద్దరూ చేయించుకోవాలి టెస్టులు" అంది అన్నపూర్ణ సుజాతని అభిమానంగా పలకరించి.

"ఆయన చూపించుకున్నారు. అన్నీ సరిగా ఉన్నాయిట."

"ఆఁ హాఁ.సరే ముందు నీకు అన్నిటెస్టులు చేద్దాం. నీకేం ప్రాబ్లమ్ లేకపోతే ఆయన్ని పిలుద్దాం" అంటే అన్నిరకాల టెస్టులు చేయించి సుజాతలో ఏం లోపం లేదని తేల్చింది అన్నపూర్ణ . "ఆయన్ని తీసుకురా. మా దగ్గర అన్నీ మోడర్న్ ఎక్విప్‌మెంటు - కొత్త పద్ధతులతో టెస్టులు చేస్తాం. ఇదివరకు ఆయనెక్కడ చేయించుకున్నారో - ఒకటి రెండుసార్లు చెయ్యాలి ఈ టెస్టులు. ఏదన్నా ప్రాబ్లమ్ ఉంటే, మందులతో కొందరికి, చిన్న సర్జరీతో సరిచెయ్యచ్చు. ఆయన్ని చూడకుండా ఇందతా చేయలేం గదా. సాధారణంగా ఏ ప్రాబ్లమ్ లేని దంపతులకి, రెగ్యులర్ పీరియడ్స్ వచ్చే వాళ్ళకి ఏడాదిలోగా ప్రెగ్నెన్సీ రావాలి. మూడేళ్ళయిందంటే ఆలోచించాలి. పరీక్షలు చెయ్యాలి." అందావిడ స్పష్టంగా. ఇంటికెళ్ళి అంతాచెప్పింది సుజాత. ప్రభాకర్ చాలా చిరాకు పడ్డాడు. "ఎన్నిసార్లు

పరీక్షలు? నాకేం లేదు? అంటూ ఎగిరాడు. సుజాతకి కోపం వచ్చింది. అత్తగారికి చెప్పింది. "ఇదిగో అత్తయ్యా నాలో ఏం లోపం లేదని తేల్చారు. మీ అబ్బాయిని తీసుకురమ్మంది ఆవిడ. ఈయన రానంటున్నారు. ఇంక పిల్లలు పిల్లలు అని నన్నంటే ఊరుకోను". సుజాత కూడా ఎగిరింది. ఆవిడ కొడుకుని చివాట్లేసి, బతిమలాడి బలవంతంగా పంపించింది డాక్టర్ దగ్గరికి. ఇద్దరూ కలిసి వెళ్ళారు. డాక్టర్ చెయ్యాల్సిన టెస్టులన్నీ చేయించి, రిపోర్టుకి మూడోరోజు రమ్మంది. ప్రభాకర్ తాను ఆఫీసునుంచి వస్తూ తెస్తానన్నాడు.

అంటే, ప్రభాకర్‌లో లోపం ఉందని, కౌంట్ తక్కువగా ఉందని డాక్టర్ చెపితే తనకి అబద్ధం చెప్పాడన్నమాట. గతం అంతా గుర్తువచ్చి సుజాత ఆ రాత్రి అంతా నిద్రపోకుండా ఆలోచించింది.

* * *

"డాక్టర్, చూశారా... మీ రిపోర్టు కోసం వెతుకుతుంటే ఆయన ముందు చేయించుకున్న రిపోర్టు మందులు వాడాక చేయించుకున్న రిపోర్టు కూడా కనపడింది. ఎక్కడో కనపడకుండా అడుగున దాచారు. ఇవి కూడా చదవండి" అంది. మర్నాడు సుజాత రిపోర్టు తీసుకెళ్ళి, ప్రభాకర్‌ని అడిగితే చెప్పడని అతను ఆఫీసుకి వెళ్ళాక అతని కప్‌బోర్డు, డ్రాయర్లు వెదికింది. ఓ డ్రాయరు అడుగున రెండు రిపోర్టులు కనబడ్డాయి. ముందు దాన్లో పన్నెండు మిలియన్లు, మొటిలిటీ 10శాతం అంటూ ఏవేవో ఉన్నాయి.

డాక్టర్ అన్నపూర్ణ రెండు రిపోర్టులు జాగ్రత్తగా పరిశీలించింది. "చూశావా, ఈ ముందు చేయించుకున్న దానిలో పన్నెండు మిలియన్లు ఉంది. మొటిలిటీ 10శాతం ఉంది. మేం చేసినప్పుడు కూడా ఇంచుమించు అంతే - పది మిలియన్లు ఉంది. మరి మేం ఇచ్చిన రిపోర్టులో 60 మిలియన్ల కౌంట్,40శాతం మొటిలిటీ అని ఎలా ఉంది. సుజాత్తా ఈ అంకెలు చూస్తుంటే నాకు అనుమానంగా ఉంది. మేం రాసింది దిద్దినట్లుంది. చూడు పదిని 60గా మార్చడం సులువు. అలాగే, 10శాతం మొటిలిటీ నలభై పర్సెంట్ అని మార్చినట్లు కనిపిస్తోంది. నాకు స్పష్టంగా పది మిలియన్ కౌంట్, 10శాతం మొటిలిటీ అన్నది గుర్తుంది. మందులవల్ల కూడా ఏం లాభం ఉండదు బహుశా. పాపం, సుజాతకి పిల్ల కోరిక తీరదు. అని బాధపడ్డాను. ఇది మీవారి పనే. నీకు చూపించి నమ్మించ డానికి."

సుజాత మొహం వివర్ణమయింది. అంటే మొదటి సారి పరీక్షించినప్పుడు అతనికి తనలో లోపం ఉందన్నది తెల్సినట్టుంది. అందుకే ఆ చిరాకు, కోపం, రెండోసారి రమ్మంటే

తన గుట్టు బయటపడుతుందని రానన్నాడు. ఈ రిపోర్టులో అంకెలు ఇలా తారుమారు చేసి తనని ఎంత నమ్మించాడు.

"ఐయామ్ సారీసుజాతా, మీవారు ఇదంతా ఇలా మానిప్యులేట్ చేస్తారనుకోలేదు. కానీ, ఆయన ధైర్యాన్ని మెచ్చుకోవాలి. నీకు బాగా తెల్సిన డాక్టరుని మళ్ళీ ఎప్పుడైనా నీతో ఈ ప్రసక్తి వచ్చినిజం తెలుస్తుందేమోనన్న భయం లేకుండా... ఇప్పుడెళ్లి అడుగు. ఏం చెప్తాడో విను.. హుఁ. ఎన్నాళ్ళఇనా ఈ మేల్ ఈగో పోదు మగాళ్ళకీ. పురుషత్వం తమలో లేదు అంటే భరించలేరు. తన అసమర్థతని అంగీకరించని పురుషాహంకారం .. ఇలా తెలియకుండా దాస్తారు. అసలు నన్ను అడిగితే పెళ్ళిళ్లకి కావల్సింది జాతకాలు సరిపోవడం కాదు. బ్లడ్ టెస్టులు, స్పెర్మ్ టెస్టులు చేయించాలంటాను. చాలా గర్వంగా ఎంతోమంది వస్తారు. తమలో లోపం ఉన్నట్లు తెలిసి కుంగిపోతారు. ఈ మాట బయటికి తెలియనివ్వద్దంటారు. భార్యకి కూడా చెప్పరు కొందరు. హుఁ... నీవు అడుగు ఎందుకిలా చేశారో. ఊరుకుంటే మరీ ఆడిస్తారు ఈ మగాళ్ళు."

సుజాత ఏదో నిశ్చయించుకున్న దానిలా "ఊఁహూఁ అడగను. ఏం తెలీనట్టే నేనూ ఊరుకుంటాను" అంది.

అన్నపూర్ణ ఆశ్చర్యంగా చూసింది.

'డాక్టర్‌గారూ, నేను తల్లిని కావాలి. ఎలాగైనా.. నాకు బిడ్డ కావాలి. బిడ్డని కంటాను.' సుజాత మొహంలో ధృఢనిశ్చయం. అన్నపూర్ణ ఆశ్చర్యంగా చూసింది.

"డాక్టర్‌గారూ నాకు ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్‌ద్వారా డోనర్ స్పెర్మ్‌తో ప్రెగ్నెన్సీ వచ్చేట్టుచెయ్యండి. ప్లీజ్, డాక్టర్ హెల్ప్‌మీ" అంది వేడుకుంటున్నట్లు.

"అదెలా సుజాతా మీవారి పర్మిషన్ లేకుండా?" ఆశ్చర్యంగా అంది డాక్టర్.

"అవసరం లేదు డాక్టర్, నేనుచెపుతున్నాను" సుజాత ధృఢంగా అంది.

"రూల్సు ఒప్పుకోవు సుజాతా. మీవారు, నీవు - ఇద్దరూకలిసి ఇష్టపడాలి. అదీ అంత సులువు కాదు. మంచి డోనర్ స్పెర్మ్‌తో ప్రయత్నించాలి. ఒకసారితో గర్భం వచ్చేయదు. కనీసం రెండు మూడుసార్లు ప్రయత్నించాలి. నెలలో అండం విడుదల అదీ లెక్కకట్టీ... చాలా తతంగం ఉంది దానికి. పోనీ మీవారితో చెప్పి ఇద్దరూ నిర్ణయించుకోండి".

"మీరు మీ ప్రయత్నం చెయ్యండి డాక్టర్. మావారికి ఏం చెప్పాలి అన్నది నేను చూసుకుంటాను. అది నాకు వదిలిపెట్టండి." సుజాత బతిమిలాడింది.

"అంటే.. అదెలా సుజాతా. ఆయనకీ సంగతి తెలిస్తే డాక్టర్‌గా నేను దోషినవుతాను. పోలీస్ కంప్లైంట్ ఇచ్చి శిక్షించే హక్కు కూడా ఉంటుంది."

"ప్లీజ్,. నాకోసం మీరు చిన్న సాయం చెయ్యండి డాక్టర్. ఆయనకి ఏం లోపం లేదని కదా చెప్పుకున్నారు. నాకు ప్రెగ్నెన్సీ వస్తే నన్ను ఎలా అనుమానిస్తారు? ఎలా నిలేస్తారు? దేవుడు దయదలిచాడు అంటాను. టిట్‌ఫర్ టాట్ - ఆయన చేసిన మోసానికి నేనూ మోసం చేస్తాను" కసిగా అంది సుజాత. సుజాత పాయింటు అర్థమై ఆలోచనలో పడింది డాక్టర్. "ఇది రిస్క్‌తో కూడింది ఇది నీ సొంత ఆలోచన, నాకేం సంబంధం లేదు. నీ ఇష్టప్రకారం చేయించుకున్నట్టు నీవు ఓ కాగితం ఇవ్వాలి. రేపుఏదన్నా అనుకోనిది జరిగినా బ్లేమ్ నీవు తీసుకోవాలి. ఇది కూడా నీ కోసం ఎంతో సాహసం చేయాలి".

"నేను అన్నింటికి సిద్ధం. ఈ విషయం మీకు, నాకు తప్ప ఎవరికీ తెలియకూడదు. మీ ప్రయత్నం మీరు చెయ్యండి. ఖర్చు బాధ నాది" సుజాత అన్నపూర్ణచెయ్యి పట్టుకుంది. అన్నపూర్ణ సగం అంగీకారంతోనే తల ఊపింది.

* * *

మూడు నెలల తరువాత పీరియడ్స్ మిస్‌కాగానే సుజాత వెళ్ళి చూపించుకుని, ప్రెగ్నెన్సీ టెస్ట్ చేయించుకుని కన్‌ఫర్మ్ చేసుకుంది. ఆ రాత్రి ప్రభాకర్ రాగానే గదిలో చాలా సంబరంగా, సినిమాటిక్‌గా సిగ్గుపడ్తూ "మన కోరిక ఇన్నాళ్ళకి తీరిందండి. దేవుడు ఇన్నాళ్లకి దయ తలిచాడు. నాకు నెల తప్పిందండి. వారం రోజుల బట్టి అనుమానంగా ఉంటే ఈ రోజు వెళ్ళి టెస్ట్‌చేయించుకున్నా, కన్‌ఫర్మ్ అయింది". గోముగా అంది. ప్రభాకర్ ఒక్కక్షణం తెల్లపోయాడు. షాకింగ్ న్యూస్ విన్నట్లు కలవరపడిపోయాడు. మొహంలో రంగులు మారిపోయాయి.

"అదేమిటి? ఎలా.. ఎలా అయింది" అన్నాడు తడబడ్తూ.

"ఎలా అవడం ఏమిటండీ? బలేవారే మొగుడూ పెళ్ళాలు కాపురం చేస్తే పిల్లలు పుట్టరా.'

"అది కాదు.. అది కాదు. ఇప్పుడెలా .. ఇన్నాళ్లకి." తడబడిపోయాడు.

"ఏదో ఇప్పటికన్నా అయింది. డాక్టర్లు ఏ లోపం లేదు, దేవుడి మీద భారం వేయమన్నారుగా. ఏమిటో అన్నీ మన చేతిలో ఉన్నాయనుకుని విర్రవీగుతాం. పుట్టుక, చావు మన చేతిలో ఏముంది. ఎప్పటికి జరగాలని ఉందో. జరిగింది. అమ్మయ్య ఇంక ఈ శుభవార్త మీ అమ్మగారికి చెప్పాలి." సంబరంగా అంది.

"సుజాతా, డాక్టరు దగ్గరికి వెళ్ళావా? ఆవిడ ఏం అంది? నసుగుతూ అన్నాడు.

"యూరిన్ టెస్ట్ చేయించి కన్ఫర్మ్‌చేసి చెప్పింది." ఇంకేం జరగనట్లు మామూలుగా అంది. అతని మొహం నల్లబడింది. ఏమనాలో తోచలేదు. మనసులో రకరకాల భావాలు, అనుమానాలు! 'అసంభవం, సంభవం' ఎలా అయింది. సుజాత ఏం చేసింది? ఈ బిడ్డ తనదేనా లేక సుజాత ఏదన్నా కాని పని చేసిందా?..'

"ఏమిటండీ అలా అముదం తాగినట్లు మొహం పెట్టారు? ఈ వార్త విని ఎంతో సంతోషిస్తారనుకున్నాను. మీకేం సంతోషంగా లేదా" బుంగమూతి పెట్టింది. "ఆc... అదికాదు. ఏమిటో నమ్మకం కలగడం లేదు. ఇన్నాళ్లూ అవనిది ఇప్పుడెలా అయిందా అని..." తడబడ్తూ అన్నాడు. సుజాత కొంటెగా చూసింది. బావుంది వరస. అయిందన్న సంతోషం కంటే," ఎందుకయిందన్న సందేహం ఎక్కువగా ఉన్నట్లుంది. ఆలోచనలు చాలించి ఈ శుభవార్త అత్తగార్కి చెప్దాం రండి." ప్రభాకర్ బలవంతంగానే చెయ్యిపట్టి లాక్కెళ్ళింది.

* * *

"మిస్టర్ ప్రభాకర్, గర్భం ఇన్నాళ్ళూ రాలేదు. ఇప్పుడెందుకు వచ్చింది అన్నదానికి ఏ డాక్టరూ జవాబు చెప్పలేరు" అన్నపూర్ణ నవ్వుతూ అంది.

"అదికాదు. రిపోర్టు చూసి, ఇంపాజిబుల్ అన్నారు కదా, పదిమిలియన్ కౌంట్‌తో గర్భం వస్తుందా." సందేహంగా చూస్తూ అడిగాడు.

"ఏమో ఆ మధ్య మీరు మందులు వాడారు కదా. సడన్‌గా అప్పుడప్పుడు కాస్త కౌంట్ ఎక్కువవుతూంటుంది. తగ్గుతూంటుంది. ఏమో, మీ అదృష్టం బాగుండి, దేవుడి దయవల్ల జరిగి ఉండచ్చు ఏం చెప్పగలం?"అన్నపూర్ణ నిర్వికారంగా అంది ఇంకేం అనాలో, ఇంకేం అడగాలో తెలియక, మనసులో అనుమానం తొలగిపోక ఇబ్బందిగా చూస్తూ లేచాడు, అన్నపూర్ణ నవ్వుకుంది. "చూడండి. మిస్టర్ ప్రభాకర్. అనవసరమైన ఆలోచనలు పెట్టుకోకుండా భగవంతుడిచ్చినది స్వీకరించండి. విష్‌యూ ఆల్ ద బెస్ట్ " సుజాతని నెలకోసారి చెకప్‌కి పంపుతూండండి" అంది.

* * *

"డాక్టర్‌గారూ, పాపం మావారి అవస్థ చూస్తే జాలేస్తోంది. నేనెవరితోనన్నా సంబంధం పెట్టుకుని కంటున్నానేమోనని ఆయన అనుమానం అనుకుంటాను. నేనిలా ధైర్యం చేసి మీ సహాయంతో గర్భం దాల్చానన్న ఊహే ఆయనకు వచ్చినట్లు లేదు. నా శీలం మీద కొంచెం అనూమనం. ఒకవేళ నిజంగానే తనవల్లే గర్భం వచ్చిందా అన్న సందేహంలో కొట్టుమిట్టాడుతున్నారు పాపం, ఈ వార్త విన్న దగ్గరనుంచి ఆమన మొహం

చూడాలి" సుజాత నవ్వుతూ అంది.

"ఐ మస్ట్ కంగ్రాజ్యులేట్ యూ, చాలా తెలివిగా ప్లాన్ చేశావు. ఇంత ఇద్దరం కష్టపడ్డందుకు ఫలితం దక్కింది. పాపం, మీవారి సందిగ్ధత తీరేది కాదు" ఆవిడా నవ్వింది. "మొదట ఆయన రాగానే ఏం అంటారోనని భయపడ్డాను కాసేపు".

"ఉండనీండి అలాగే, ఆ అనుమానం, నన్ను మోసం చేసినందుకు ఈ శిక్ష చాలు ఆయనకు. జీవితాంతం ఈ బిడ్డ తనదా, కాదా అన్న అనుమానంతో కక్కలేక మింగలేక పడే అవస్థ చాలు ఆయనకు. హుఁ. భార్య దగ్గర నిజం దాచి తెచ్చుకున్న అవస్థ ఇది. నిజం చెపితే హాయిగా ఏ బిడ్డనో తెచ్చి పెంచుకునేవాళ్లం. ఈ మాత్రం దానికోసం మగ అహంకారంతో భార్యల్ని మోసం చేద్దామనుకున్నందుకు ఈ శిక్షచాలంటాను." సుజాత అంది. అన్నపూర్ణ అంగీకారంగా తల ఊపింది.

◆ ఇండియా టుడే, ఏప్రిల్-మే, 1997